క్లుప్తంగా

బండ ప్రకాశ్‌ను కలిసిన ముదిరాజ్‌లు



డిప్యూటీ చైర్మన్‌తో ముదిరాజ్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండ ప్రకాశ్‌ను ఉమ్మడి మద్దూరు మండల ముదిరాజ్ మహాసభల అధ్యక్షుడు చొప్పరి సాగర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌ను సాగర్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో ముదిరాజ్ సంఘ భవన కమిటీ హాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, గాగ్గిళ్లాపూర్ సర్పంచ్ కృష్ణవేణిచంద్రమౌళి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ధర్మారంలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ మంగ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతమధూకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బాలమణికనకరాజు, మాజీ ఎంపీటీసీ నాంపల్లి రాజమల్లు, మాజీ జెడ్పీటీసీ భీలునాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

'అష్టకాల' మృతిపై వర్గల్ ఆలయ కమిటీ సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, తదితరులు

వర్గల్(గజ్వేల్): అవధాన సరస్వతి, అష్టావధాని, అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర నిర్మాత అష్టకాల నరసింహరామశర్మ అకాల మరణంపై వర్గల్ విద్యాసరస్వతి శనైశ్చర ఆలయ కమిటీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. గురువారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి అధ్యక్షతన కొనసాగిన సంతాప సభలో అష్టకాల నరసింహరామశర్మతో వర్గల్ క్షేత్రానికి ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఆయన మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

యువతకు సహకారం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న టీవైఆర్ ఫౌండేషన్ అధినేత రాజు

గజ్వేల్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు సహకారం అందించడమే లక్ష్యంగా తమ లైబ్రరీలో కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు టీవైఆర్ ఫౌండేషన్ అధినేత రాజు అన్నారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోల జనార్దన్‌తో కలిసి టీవైఆర్ ఫౌండేషన్ లైబ్రరీలో పోటీ పరీక్షల కోచింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ ప్రభావతి, ప్రధాన కార్యదర్శి రాహుల్, ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

దుబ్బాకటౌన్: శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ సామ అనసూయ, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మిలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం దారుణమని, వీరిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి భేషరతుగా విడుదల చేయాలని పలు సంఘాల నాయకులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా బీడీ కార్మిక ఉద్యమంలో పనిచేస్తున్న 60 ఏళ్ల పైబడ్డ వృద్ధులైన అనసూయ, వెంకటలక్ష్మిలు అనారోగ్యాలతో బాధపడుతున్న వీరిద్దరిపై బెదిరింపులు, ట్రెస్ పాస్‌లతో పాటు ఆయుధాల కేసులు మోపీ అక్రమంగా అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే అక్రమ కేసులు ఎత్తివేసి జైలులో ఉన్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు, రైతుకూలి పోరాట సమితి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లన్న, శ్రామికశక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రసులాబాద్‌లోని పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు రూ.16లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అత్యధిక నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నామన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రసులాబాద్ గ్రామ పంచాయతీగా ఏర్పడిన తర్వాత గ్రామంలో సుమారు కోటి రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. అంతకుముందు మండలంలోని గౌరాయపల్లిలో రూ.16లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన, కొమురవెల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, గౌరాయపల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఎంపీటీసీలు కొయ్యడ రాజమణి, సాయిమల్లు, మండల నాయకులు కిషన్, కృష్ణ, రసులాబాద్ ఉపసర్పంచ్ సురేశ్, ఎంపీడీవో అనురాధ, ఎంపీవో మంజుల, పీఆర్ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



హుస్నాబాద్‌రూరల్: మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్ అన్నారు. గురువారం దూల్మిట్ట మండలంలోని తోర్నాల, జాలపల్లి గ్రామాల్లో ×ప్రజాగోస–బీజేపీ భరోసా₹పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సురేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ గ్రామాన ఎండగట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భిక్షపతి, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు రచ్చ సంతోష్‌కుమార్, గుంటిపల్లి రమేశ్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మహిపాల్, పరశురాములు, లింగం, రచ్చ మురళీ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు పైసా ఇవ్వడం లేదని బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నాగారంలో ప్రజాగోసపై సమావేశం నిర్వహించగా సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద వచ్చిన నిధులు తప్పా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక నిధులను ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో నాయకులు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, బొమ్మగాని సతీశ్, భూక్య సంపత్, పోలోజు రాజేందర్, కొలిపాక కిరణ్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన నియంతృత్వ అవినీతి పూరిత పాలనకు అంతం పలికేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



భజన చేస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): దైవ చింతనతో మానసిక ప్రశాంతత దొరుకుతుందని శతకోటి హరేరామ నామ జప యజ్ఞం కన్వీనర్ శ్రీధర్ శర్మ అన్నారు. శతకోటి హరేరామ జప నామ యజ్ఞం పురస్కరించుకొని గురువారం మండలంలోని మునిగడపలో అఖండ హరే రామ నామ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆధ్యాత్మికత అనేది కనుమరుగవుతుందని ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంకీర్తన భజన మండలి సభ్యులు శ్రీధర్, రవి, ప్రసాద్, రాంచంద్రం, లింగం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: కొండపోచమ్మసాగర్ నీళ్లతో దుబ్బాక నియోజకవర్గంలోని దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట మండలాలను సస్యశ్యామలం చేస్తామని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో కొండపోచమ్మ నుంచి రామాయంపేటకు వెళ్లు కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేటకు వెళ్లు ఈ కాల్వలోకి త్వరలోనే గోదావరి నీళ్లను విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి రైతుల సాగు నీటి కష్టాలు తీర్చుతామన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులున్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ధర్మారంలో గురువారం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పబాగులు, ఉపసర్పంచ్ ఉప్పలయ్య, పాఠశాల హెచ్ఎం అనురాధ, ఛత్రపతి శివాజీ సేన గ్రామ అధ్యక్షుడు రవి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని తోటపల్లి, వీరాపూర్, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూరు గ్రామాల్లో గురువారం లబ్ధిదారులను కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయలను వెచ్చించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **భూములు దోచుకోవడానికే ధరణి**

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదల భూములు దోచుకునేందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకొచ్చిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. గురువారం ఆయన చిన్నకోడూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ధరణిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసేలా పాలన సాగిస్తుందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, ప్రశాంత్, రాజు, గణేశ్ తదితరులు ఉన్నారు.

◆ **ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా**

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాద బీమా అనేది కుటుంబానికి ఆర్థిక భరోసాగా ఉంటుందని ఏపీజీవీబీ జిల్లా మేనేజర్ రజాక్ పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండలంలోని రేబర్తి, ధర్మారం గ్రామాలకు చెందిన అశోక్‌రెడ్డి, కనకయ్యలు మరణించడంతో వారికి మంజూరైన ప్రమాద బీమా రూ.20లక్ష చెక్కులను వారి కుటుంబాలకు అందజేశారు.

◆ **మాణిక్‌రావు థాక్రేను కలిసిన పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి**

దుబ్బాకటౌన్: తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు థాక్రేను గురువారం గాంధీభవన్‌లో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ పరిస్థితిని వివరించినట్లు ఆయన తెలిపారు.

◆ **ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి**

దుబ్బాకటౌన్: ఆశవర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీలకు చెందిన ఆశవర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆశవర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, భాగ్యలక్ష్మి, చంద్రకళ, శోభ, శ్యామల, దేవలక్ష్మి, రజిత, మమత, అనిత, సీఐటీయూ పట్టణ కన్వీనర్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

◆ **అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ ఇళ్ల అర్హుల జాబితాలో అవకతవకలు ఉన్నాయని రీ సర్వే చేసి పేదలకు న్యాయం చేయాలని బీజేపీ కౌన్సిలర్లు ప్రశ్నిస్తే ముందుగానే అరెస్టు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాం ఖండించారు. గురువారం అరెస్ట్ అయిన బీజేపీ కౌన్సిలర్లు, నాయకులను స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు జనగామ వేణుగోపాల్‌రావు, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వేణు, స్వర్ణలతసత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

◆ **రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి**

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రాన్ని సాధించి, దేశం గర్వించే విధంగా ప్రజా అవసరాలను తీరుస్తున్న సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా అంగడిబజార్ వద్ద ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. శిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కోరారు.

◆ **మథర్ ఫీడింగ్ క్యాబిన్ ప్రారంభం**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో మథర్ ఫీడింగ్ క్యాబిన్‌ను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ మానెపల్లి రామారావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవే లక్ష్యంగా వాసవి క్లబ్ నడచుకుంటుందన్నారు. క్యాబిన్ ఏర్పాటుకు గౌరిశెట్టి రాజు పరమేశ్వరి దంపతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు తాటిపెల్లి వీరేశం, కార్యదర్శి కంభంపాటి రాంబాబు, బల్లు సంపత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు రాగి కవిత, గోగుల రాధిక, గంగిశెట్టి లత పాల్గొన్నారు.

వైభవంగా నాచగిరి శివాలయ వార్షికోత్సవాలు



గణపతిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలోని శివాలయ 57వ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు కొనసాగే వేడుకల్లో భాగంగా తొలిరోజు అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, రుద్ర, సూర్యహోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాలు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేట గ్రామంలో జరుగుతున్న మల్లికార్జునస్వామి విగ్రహప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పీసీసీ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ మంజె మల్లేశం, కిసాన్ సెల్ చేర్యాల మండల అధ్యక్షుడు సూర్న శ్రీకాంత్, నాయకులు సూర్న శ్రీశైలం, బొందుగుల రాములు, మహేశ్, మెరుగు చంద్రమౌళి, ఎంపీటీసీ శివశంకర్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఫుట్‌బాల్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

కొండపాక(గజ్వేల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ గురుకుల పాఠశాల విద్యార్థులకు టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భాస్కర్ సహకారంతో ఫుట్‌బాల్ కిట్లను, టీషర్టులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు మాధురీరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, ఎంపీటీసీ బాలాజీ, ఆత్మ కమిటీ డైరెక్టర్ చిరంజీవి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ



లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ సలీంమియా

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని గతంలో డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను శుక్రవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ సలీం మియా లబ్ధిదారులను కోరారు. గురువారం రాత్రి దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల వివరాలను వారు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక పట్టణంలో గతంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు, భర్త ఆధార్ వివరాలను తమకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా సాట్స్(తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో డీవైఎస్‌వో నాగేందర్, పీడీ ఎలియాస్‌రావుల పర్యవేక్షణలో గురువారం క్రీడాకారిణులకు(యువతులకు) జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. డీవైఎస్‌వో నాగేందర్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా జరిగిన చెస్ పోటీల్లో 30 మంది క్రీడాకారిణులు పాల్గొనగా ఇందులో గెలుపొందిన విజేతలు ఈనెల 17న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ హెచ్ఎం బ్రిగ్జిట్, పీఈటీ నాగేశ్, సామాజిక కార్యకర్త దేశబోయిన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



గ్రామాభివృద్ధిపై ఆరా తీస్తున్న ట్రైనీ కలెక్టర్ ఫైజా అహ్మద్

నంగునూరు(సిద్దిపేట): మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదిగితే కుటుంబం అన్ని విధాల బాగుంటుందని ట్రైనీ కలెక్టర్, ఎంపీడీఓ ఫైజా అహ్మద్ అన్నారు. గురువారం నర్మేటలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించి గ్రామ ఆర్థిక వ్యవస్థ, స్థితిగతులపై ఆరా తీశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అందుతున్న ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ అజీద్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఈసీ పాషా, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ




ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయవర్ధన్‌రెడ్డి, హెచ్ఎం బాల్‌లింగం, ఉపాధ్యాయులు తిరుపతి, రజిత, చంద్రప్రసాద్, శ్రీనివాస్, సరిత, మాధవీలత పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, పాఠశాల హెచ్ఎం సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు తాళాలు



దుబ్బాక బస్టాండ్‌లో తాళాలు వేసిన మరుగుదొడ్లు

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో నిర్మించిన బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు అధికారులు తాళాలు వేశారు. గతంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను అధికారులు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో సాక్షిలో ×ప్రయాణికులకు వసతులు కరువు₹ అనే శీర్షికతో కథనం ప్రచురించగా అధికారులు స్పందించి నూతన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. కానీ మరుగుదొడ్ల నిర్మాణం సరిగా లేకపోవడంతో మగవారి కోసం నిర్మించిన మరుగుదొడ్లు మురుగుతో నిండిపోయి పాడైపోయాయి. దీంతో అధికారులు మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే మరుగుదొడ్లు పాడయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.